# వికసించిన బ్రహ్మకమలం


నిజాంపేటలో..

నిజాంపేట, సెప్టెంబర్ 26: నిజాంపేటలో పురోహితుడు వెంకటరమణ ఇంట్లో బ్రహ్మకమలం వికసించింది. ఈ పువ్వును కల్వకుంటలోని వేంకటేశ్వర స్వామికి అలకరించారు.


రామాయంపేటలో..

**శివాలయంలో బ్రహ్మకమలం**
రామాయంపేట, సెప్టెంబర్ 26: స్థానిక శివాలయంలో బ్రహ్మకమలంతో శివుడికి భక్తులు ఎడ్ల మోహన్‌రెడ్డి, క్యాసం సంతోష్ దంపతలు అభిషేకాలు చేశారు.

# పీహెచ్‌సీలో జిల్లా వైద్యాధికారి తనిఖీ



కొల్చారం, సెప్టెంబర్ 26: కొల్చారం పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ గురువారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. స్టోర్ రూమ్, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సరైన వైద్యం అందుతున్నదా లేదా అని ఆరా తీశారు. మందుల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్ కుమార్, మండల వైద్యాధికారి రమేశ్, సిబ్బంది ఉన్నారు.

# అంబులెన్స్‌లో ప్రసవం



నిజాంపేట, సెప్టెంబర్ 26: బీహార్ రాష్ట్రానికి చెందిన గర్భిణీ లక్ష్మీదేవి బతుకుదెరువు కోసం నిజాంపేటకు వచ్చారు. స్థానిక శ్రీచక్ర పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్నది. గర్భిణీ అయిన లక్ష్మీదేవికి బుధవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆశవర్కర్ గౌరీ రామాయంపేట 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది స్వామి, అసిఫ్, లక్ష్మీదేవిని దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే సాధారణ ప్రసవం జరిగింది. ఆమె మగశిశువుకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు ఆరోగ్యం నిలకడగా ఉంది. దీంతో ప్రగతి ధర్మారం దవాఖానకు తరలించారు.

# కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

శివ్వంపేట, సెప్టెంబర్ 26: మండలంలోని కొంతాన్‌పల్లి గ్రామంలో కుంటలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కమలాద్రికి గ్రామ మత్స్యకారులు గురువారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని కరీంకుంట, మాసానికుంట శిఖాలను రియల్ వ్యాపారులు ఆక్రమించారని ఆరోపించారు. కుంటలకు వెళ్లే దారిని కూడా ఫెన్సింగ్ వేశారని, తామను చేపలు పట్టడానికి వెళ్లనివ్వడం లేదన్నారు. ఈ సమస్యపై గతంలో రెవెన్యూ అధికారులకు సర్వే చేసి హద్దులు నిర్మించారని, ఆ హద్దులను తొలిగించారన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కొంతాన్‌పల్లి మాజీ సర్పంచ్ దేవలింగం, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రావు, మత్స్యకారులు శంకర్, మహేశ్, నగేశ్, వెంకటేశ్, సత్తయ్య, శ్రీరాములు ఉన్నారు.

# బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



రామాయంపేట, సెప్టెంబర్ 26: దివంగత వెంకటి కుటుంబాన్ని రజక సంఘం ఆదుకుంటుందని జిల్లా రజక సంఘం అధ్యక్షుడు సంగు స్వామి అన్నారు. మాజీ వార్డు సభ్యుడు చాకలి వెంకటి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి గురువారం రూ.6500 నగదు అందజేశారు.

# సర్కారు బడుల్లో ప్రగతి పనుల పరిశీలన

నర్సాపూర్, సెప్టెంబర్ 26: మండలంలోని రెడ్డిపల్లి, మంతూర్, కాజీపేట్ ప్రభుత్వ పాఠశాలలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సీహెచ్ శ్రీనివాస్‌రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల ప్రగతి పరిశీలనకు పాఠశాలలు సందర్శించినట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఎం గౌరి శంకర్, సీసీ ప్రవీణ, సీఏలు మంగ, మహేశ్వరి, జ్యోతి స్వప్న, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు శివరంజని, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


# కొండా లక్ష్మణ్ జయంతికి తరలిరావాలి

రామాయంపేట, సెప్టెంబర్ 26: జిల్లా కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో నిర్వహించే కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిలో బీసీ కులస్తులంతా తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో రజక సంఘ జిల్లా అధ్యక్షుడు సంగు స్వామి, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మద్దెల రమేశ్, అల్లాడి వెంకటి, మధునాల స్వామిగౌడ్, మామిడి సిద్ధరాములు ఉన్నారు.

# ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 26: ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని జిల్లా రవాణాధికారి వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రవాణా శాఖలోని వివిధ సెక్షన్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీమ్ అధికారి విజయ్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# 'గ్రోస్' సేవలు అభినందనీయం



మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 26: గ్రోస్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. మెదక్ చర్చి వందేండ్లు పూర్తి చేసుకోబోతున్న సందర్భంగా గ్రోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని 32 మంది పేదలకు సన్న బియ్యంతో పాటు నిత్యావసరాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి సెక్రెటరీ శాంసన్ సందీప్, పాలిన్, జోయల్‌సామ్, శ్రేష్ట, చెర్రీ, ఫెర్రీ, మెర్రీ, ఆనంద్‌సింగ్ పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక ఐలమ్మ

## - కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ అని కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. గురువారం మెదక్‌లోని బాబూ జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీ సంక్షేమ అధికారి నాగరాజు గౌడ్, జిల్లా రజక సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీసీ, ఎంబీసీల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు నిర్వహించారు.


చాకలి ఐలమ్మ జయంతిలో కలెక్టర్ రాహుల్‌రాజ్


చేగుంటలోని స్టేషన్ రోడ్డులో టీచర్ల నివాళులు


నిజాంపేటలో రజక సంఘం సభ్యుల నివాళులు


రామాయంపేట ఝాన్సీలింగాపూర్‌లో ..


శివ్వంపేట: పెద్దగొట్టిముక్కలో నివాళి


వెల్దుర్తిలో ఐలమ్మ చిత్ర పటానికి నివాళులు


నర్సాపూర్‌లో నివాళులర్పిస్తున్న రాజిరెడ్డి, తదితరులు


పెద్దశంకరంపేటలో చాకలి ఐలమ్మకు నివాళులు

# ఉద్యోగోన్నతితో బాధ్యత పెరుగుతుంది


## - ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


ఏఆర్ ఎస్సైకి స్టార్స్ పెడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 26: ఉద్యోగోన్నతితో బాధ్యత మరింతగా పెరుగుతుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగోన్నతి పొందిన ఏఆర్ ఎస్సైలుగా జె.వెంకటరాములు, జె.లక్ష్మీనారాయణ ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ మరిన్ని ఉద్యోగోన్నతులు పొంది, పోలీస్ శాఖకు పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.

**అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవాలి**
రేపు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. రాజీపడే అవకాశం ఉన్న కేసులను లిస్టవుట్ చేసుకోవాలని, రాజీ పడదగిన కేసులను ఇరు వర్గాల వారిని పిలిపించి రాజీ మార్గమే రాజ మార్గమని అర్థమయ్యేలా తెలపాలని సిబ్బందికి సూచించారు.

# నేడు స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావ దినం


మెదక్ చర్చి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 26: స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. మెదక్ చర్చి నిర్మాణం 1914లో ప్రారంభమై 1924 లో పూర్తయింది. ఆనంతరం 23 సంవత్సరాల తరువాత 1947 సెప్టెంబర్ 27 చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (స్త్రీ మైత్రి సంఘం) ఆవిర్భవించింది. శుక్రవారం 78వ ఆవిర్భావ వేడుకలు జరుపుకోనున్నారు. ఈ కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి మహిళా భక్తులే పెద్దఎత్తున తరలివస్తుంటారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, అనంతరం పట్టణంలో మైత్రీ సంఘాల మహిళల ఆధ్వర్యంలో ఏసయ్య భక్తి గీతాలు ఆలపిస్తూ నృత్యాలు, కోలాటాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహిస్తారు. ఈ ర్యాలీలో బిషప్‌తో పాటు స్త్రీ మైత్రీ సంఘం అధ్యక్షురాలు బిషపమ్మ పాల్గొనడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో సీఎస్ఐ కమిటీ సభ్యులు, డయాసిస్ పరిధిలోని పాస్టర్లు, బాధ్యులు పాల్గొంటారు.


# రేపటి నుంచి యువజనోత్సవాలు


కొల్చారం: కళా ఉత్సవ్ కార్యక్రమంలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 26: ఆధునిక యుగంలో అంతరించిపోతున్న ప్రాచీన కళలకు ప్రాణం పోసేందుకు జిల్లా యువజన, క్రీడా శాఖ కృషి చేస్తోంది. జిల్లా స్థాయిలో యువజన ఉత్సవాలు (కళా ఉత్సవ్ పోటీలు) నిర్వహిస్తున్నది. జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం, పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియం దీనికి వేదిక కానున్నది. ఈనెల 28వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 9 విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన కళాకారులు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, స్థానిక సంస్థలు, కేజీబీవీ, టీఎస్ మోడల్ స్కూల్స్, గురుకుల, ఆశ్రమ ఇతర విద్యాసంస్థల్లో 9 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రతి అంశంలో ఒక్కొక్కరు (బాలుడు, బాలిక) చొప్పున ఎంపిక చేస్తారు. ఒక విద్యార్థి ఒక పోటీలో మాత్రమే పాల్గొనే అవకాశం ఉంటుంది. 15 నుంచి 29 ఏండ్ల లోపు వయస్సు కలిగిన వారే పాల్గొనే అవకాశం ఉంటుంది. జానపద నృత్యం(గ్రూప్), జానపద పాట (గ్రూప్), కథ రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన, వక్తృత్వం, ఫొటోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. సమాచారం కోసం 9493594388, 7396313741 నంబర్లలో సంప్రదించాలి.

**మండల స్థాయిలో కళా ఉత్సవ్**
కొల్చారం, సెప్టెంబర్ 26: కొల్చారంలోని మండల వనరుల కేంద్రంలో కళా ఉత్సవ్ కార్యక్రమాన్ని ఎంఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడు విభాగాల్లో పోటీలు నిర్వహించగా విభాగానికి ఒక్కరు చొప్పున పది మంది విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, మధుకర్, నరేశ్ చారి, సిబ్బంది సంపత్, రాజశేఖర్, సాయి కుమార్, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి


ఎంపీ రఘునందన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట, సెప్టెంబర్ 26: పోతులబొగుడ నుంచి అనంతారం చౌరస్తా వరకు నిర్మిస్తున్న రెండు వరుసల రహదారి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ రఘునందన్‌రావుకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ వినతిపత్రం అందజేశారు. పనులు ప్రారంభించి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు సగం కూడా కాలేదని తెలిపారు. పోతులబొగుడు, పాంబండ, భీమ్లతండా, ఉసిరికపల్లి, చండి, గోమారం, లచ్చిరెడ్డిగూడెం, నవాబ్‌పేట గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీని కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి, మండలాధ్యక్షుడు పెద్దపులి రవి, నాయకులు పనసారెడ్డి, ఆంజనేయచారి, సుదర్శన్, నాగేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజు ఉన్నారు.

# పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 26: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం 5వ వార్డులో డ్రైనేజీలు శుభ్రపరిచి, పిచ్చి మొక్కలు తొలిగించి, చెత్త చెదారాన్ని చెత్త వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త, హానికర వస్తువులపై మహిళలకు అవగాహన కలిగించారు. మున్సిపల్ వాహనాల్లో తడి, పొడి చెత్తను వేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ మహేశ్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# డంప్‌యార్డ్ నిర్మాణం నిలిపేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, సెప్టెంబర్ 26: నర్సాపూర్ సమీపంలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో ప్రభుత్వం తలపెట్టిన డంప్‌యార్డ్ నిర్మాణ పనులు నిలిపివేయాలని మున్సిపల్ సాధారణ సమావేశంలో తీర్మానించారు. గురువారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతనలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో డంప్‌యార్డ్ నిర్మిస్తే అడవి పరిసరాలు, రాయారావు చెరువు కలుషితం అవుతుందన్నారు. నూతనంగా గొర్రెలు, మేకల సంత నిర్వహించేందుకు తీర్మానించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున ఆరోగ్య శాఖ తరపున ఇంటింటి సర్వే చేసి, మందులు సరఫరా చేయాలని 3వ వార్డు కౌన్సిలర్ ఇస్రత్ సిద్ధిఖీ కోరారు. ప్రతి శుక్రవారం సంతలోకి ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని 12వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి లక్ష్మి తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ లలితాభిక్షపతి, సునీతాబాల్‌రెడ్డి కోరారు. బోర్లలో మోటర్లు బిగించి నీటి సమస్యను పరిష్కరించాలని 14వ వార్డు కౌన్సిలర్ సరితాఆంజనేయులు అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, కౌన్సిలర్లు, పీఆర్‌డీఈ రాధికలక్ష్మి, మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 26: మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ గురువారం ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రం ఆప్షనల్ సబ్జెక్ట్‌గా చదివిన లేదా మైక్రో బయాలజీలో ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులకు ఫార్మాసిటికల్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 28 ఏండ్ల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 7382929698 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# వైకుంఠ రథం కొనుగోలుకు విరాళం



చిలిపిచెడ్, సెప్టెంబర్ 26: శీలాంపల్లి పంచాయతీలో వైకుంఠ రథం కొనుగోలుకు రూ. 1.65 లక్షల చెక్కును ఎల్లయ్యగారి రాజేందర్‌రెడ్డి గురువారం పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. నాయకులు ము కుందరెడ్డి, భగవంతురెడ్డి, నవీన్‌రెడ్డి, సాయిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# కాండం తొలుచు పురుగును గమనించాలి



చిలిపిచెడ్, సెప్టెంబర్ 26: వరి పంటలో కాండం తొలుచు పురుగును గమనించాలని ఏడీఏ పుణ్యవతి తెలిపారు. గురువారం అంతారం గ్రామంలో ఏవో రాజశేఖర్ గౌడ్, ఏఈవో భూపాల్, రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 26: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని చిన్నశంకరంపేట జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం దీప్లా తెలిపారు. గురువారం కళోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. గ్రూప్ ఫోక్ డ్యాన్స్‌లో చిన్నశంకరంపేట జడ్పీహెచ్ఎస్, సింగిల్ ఫోక్ డ్యాన్స్‌లో కేజీబీవీ, క్లాసిక్ డ్యాన్స్‌లో జడ్పీహెచ్ఎస్ మిర్జాపల్లి పాఠశాల, కథల పోటీలలో జడ్పీహెచ్ఎస్ చందంపేట, విజేతలుగా నిలిచారు.

# వృద్ధురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే



శివ్వంపేట, సెప్టెంబర్ 26: మండలంలోని గోమారం గ్రామానికి చెందిన కుక్కల భూదమ్మ ఇంట్లో జారి కిందపడడంతో తుంటి ఎముక విరిగింది. విషయం తెలిసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. తగిన ఆర్థికసాయం అందించారు.

# పాఠశాలల పనితీరు మెరుగుపడాలి



వెల్దుర్తి, సెప్టెంబర్ 26: పాఠశాల పనితీరు మెరుగుపడాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. గురువారం వెల్దుర్తి జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న పాఠశాల సముదాయ సమావేశాన్ని డీఈవో సందర్శించారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన గోడపత్రికను హెచ్ఎం సాంబయ్యతో కలిసి ఆవిష్కరించారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మనోహరాబాద్, సెప్టెంబర్ 26: స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని అడిషనల్ డీఆర్డీవో సరస్వతి అన్నారు. గురువారం మనోహరాబాద్‌లోని సమాఖ్య కార్యాలయంలో వీవోఏ, సీఏలతో సమావేశాన్ని నిర్వహించారు. బ్యాంకు లోన్లు ఇవ్వడంలో జిల్లా వెనుకబడి ఉందని, అర్హులైన మహిళలను గుర్తించి లోన్లు ఇప్పించేందుకు సహకరించాలన్నారు. మొండి బకాయిలను వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 26: మండలంలోని మఖ్త లక్ష్మాపురం గ్రామానికి చెందిన వెల్పుగొండ సుశీల మోకాలు చికిత్స కోసం రూ.75 వేల ఎల్‌వోసీ చెక్కు గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి వారి కుటుంబసభ్యులకు అందజేశారు. ఆయనతో మాజీ ఎంపీటీసీ ఆకుల స్వప్న శ్రీనివాస్, నర్సింహులు తదితరులున్నారు.

# నిందితులపై చర్యలు తీసుకోవాలి



రామాయంపేట, సెప్టెంబర్ 26: మండలంలోని సుతారిపల్లికి చెందిన పున్న స్వామి ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, తహసీల్దార్‌ను కలిసి గురువారం వినతి పత్రాలు అందజేశారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



నిజాంపేట, సెప్టెంబర్ 26: నిజాంపేటకు చెందిన తాళ్లపల్లి రాధకు రూ.54 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం స్థానిక నాయకులు మహేందర్, మారుతి బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. నాయకులు నసీరొద్దీన్, వెంకటేశ్‌గౌడ్, రాములు ఉన్నారు.

# వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలి



రామాయంపేట, సెప్టెంబర్ 26: వీఆర్‌ఏల వారసులకు ప్రభుత్వం ఉద్యోగాలివ్వాలని కోరుతూ వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రజనీకుమారికి గురువారం వినతిపత్రం అందజేశారు.

# వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి

కొల్చారం, సెప్టెంబర్ 26: వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు రాజు, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మారయ్యతో కలిసి ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. కొల్చారం ఫారెస్ట్ అధికారులు వడ్డెరులను రాళ్లు కొట్టనీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. స్థానిక తిరుమలయ్య గుట్ట ప్రాంతంలో తరాలుగా రాయి కొట్టి జీవిస్తున్నారని, డీఎఫ్‌వో వారిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వారితో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశం, తదితరులు ఉన్నారు.

# భౌగోళికల అంశాలపై అవగాహన

నర్సాపూర్, సెప్టెంబర్ 26: నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో బీఎస్సీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్, ఎన్‌జీఆర్ఐ విద్యార్థులకు భూమిలో శిలలు ఏర్పడే విధానం, శిలల్లోని ఖనిజ, లవణాలను గుర్తించే విధానాన్ని, శిలల వయస్సును నిర్ధారించే విధానాన్ని శాస్త్రవేత్తలు వివరించారు. సూర్యగ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడే విధానం, అగ్నిపర్వతాలు, అయస్కాంత ధర్మం, సైబర్ క్రైమ్ లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.సురేశ్‌కుమార్, సౌజన్య, రుక్మిణి, ఆరిఫ్, రమేశ్ పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు